'హైడ్రా' కూల్చివేతలను సహించం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


నారాయణ చెరువు పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

మేడ్చల్‌రూరల్: హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చితే సహించమని.. పేదల పక్షాన కూల్చివేతలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని నారాయణ చెరువును ఎంపీ ఈటల శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా భయంతో తాము బిక్కుబిక్కుమని గడుపుతున్నారని, ఎప్పుడు ఎవరు వచ్చి తమ ఇళ్లు కూలగొడతారోనని కూలీపనులకు కూడా వెళ్లడం లేదని ఈటలతో స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఈటల మాట్లాడుతూ... తాను మీకు కూతవేటు దూరంలోనే ఉంటానని అన్యాయం జరగకుండా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరును ఈటల తీవ్రంగా ఆక్షేపించారు. ఆయన వ్యవహార తీరు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అల్వాల్‌లోని జొన్నలగడ్డ ప్రాంతానికి 100 ఏళ్ల క్రితం 72 వడ్డెర కుటుంబాలు వలస వచ్చాయని బండలు కొట్టి ఇళ్లు కట్టుకుంటే ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా వర్తింపజేసి డబ్బులు ఇచ్చారని కానీ నేడు హైడ్రా అధికారులు వచ్చి ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉంది అని నోటీసులు ఇచ్చి వెళితే వారు నిద్రలేని రాత్రిళ్లు గడుపుతున్నారన్నారు. కూకట్‌పల్లిలో మరణించిన బుచ్చమ్మ చావుకు కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని, ఇది సర్కార్ హత్యే అన్నారు. మూసీ ప్రక్షాళన చేస్తానంటే తాను సంతోషించానని వరదలు రాకుండా చర్యలు చేపడుతారని, మూసీ వాసన రాకుండా, మురికి నీరు పారకుండా చేస్తారిన తాను భావించానని కానీ నేడు 50 ఏళ్ల క్రితం నిర్మాణమైన చైతన్యపురి కాలనీలో ఆర్‌బీ ఎక్స్ పేరుతో మార్కింగ్ చేస్తూ దుర్మార్గాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, సరస్వతి, నాయకులు రవీందర్‌గౌడ్, నాగరాజు, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్ పాసుల పంపిణీ


పాసులను అందజేస్తున్న
చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలోని శివారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాల, కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న సుమారు రెండొందల మంది విద్యార్థులకు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఇన్‌స్పెక్టర్ సైదులుతో కలిసి ఆర్టీసీ బస్ పాసులను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద విద్యార్థులకు అండగా నిలవాలని ఆర్టీసీ బస్ పాసులు అందజేశామని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. కౌన్సిలర్లు నరేశ్‌యాదవ్, మల్లేశ్, ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పురపాలక సంఘం ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, జంగయ్యయాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, అశ్రాఫ్ అలీ, ఆంజనేయులు, శశిధరన్, సునిల్‌కుమార్, ఆర్టీసీ ప్రతినిధి రాంచందర్, పాల్గొన్నారు.

రైతు బీమా చెక్కు అందజేత



కీసర: అనారోగ్య కారణంగా ఇటీవల మృతిచెందిన భోగారం గ్రామానికి చెందిన రాంశెట్టి అశోక్ కుటుంబ సభ్యులకు రైతు బీమా పథకం కింద మంజూరైన రూ. 5 లక్షల చెక్కును శనివారం అధికారులు, గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. రైతు సంఘం అధ్యక్షుడు పడమటి నరసింహారెడ్డి, కీసర మండల కాంగ్రెస్ నేతలు సుంకరి జైహిందర్‌రెడ్డి, గన్నేర్ల సత్యనారాయణ, శివయ్య, రాజు, మహేంద్ర భూపతి పాల్గొన్నారు.

మారినో ఫుడ్ కంపెనీలో అధికారుల తనిఖీలు

మేడ్చల్‌రూరల్: రాజబొల్లారం గ్రామ పరిధిలోని మారినో ఫుడ్ ప్రొడక్స్ కంపెనీలో పనిచేసే బాల కార్మికుడు పనిచేయడం ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విదితమే. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న మేడ్చల్ పోలీసులు, కార్మిక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఇతర సంబంధిత శాఖల అధికారులు శనివారం కంపెనీలో తనిఖీలు చేసి విచారణ చేపట్టారు. మేడ్చల్ ఏసీపీ, సీఐలతో పాటు సంబంధిత శాఖల అధికారులు శనివారం మధ్యాహ్నం కంపెనీ, కార్మికుల క్వార్టర్స్ పరిశీలించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన బాలకార్మికులను ఇక్కడికి తీసుకువచ్చి కంపెనీ క్వార్టర్స్‌లోనే నివాసం కల్పించి వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని సంబంధిత శాఖల అధికారులు గుర్తించినట్లు సమాచారం. అధికారులు విచారణకు సంబంధించిన వివరాలు మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు.

ఆరోగ్య సంరక్షణపై పారిశుద్ధ్య కార్మికులు శ్రద్ధ చూపాలి


అవగాహన కల్పిస్తున్న
చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే మున్సిపాలిటీ పరిశుభ్రంగా ఉంటుందని, అందుకే తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. స్వచ్ఛత హీ సేవా–2024లో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సాబేర్ అలీతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విధులు నిర్వహించే సమయంలో కార్మికులు చేతులకు గ్లౌస్, ఆప్రాన్, ఫేస్ మాస్క్ ధరించాలని సూచించారు. శుభ్రత కోసం పనిముట్లు వాడుకొనే విధానం తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిరాజ్, శ్రీను, రాజేశ్, యోగేశ్వర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘనంగా నివాళి


గౌడవెల్లిలో భగత్‌సింగ్‌కు
నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు


జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

మేడ్చల్: స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో, పట్టణంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆయన జయంతిని నిర్వహించారు. మేడ్చల్‌లో బీజేపీ నేతలు భగత్‌సింగ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గౌడవెల్లిలో కాంగ్రెస్ నేతలు భగత్‌సింగ్ విగ్రహనికి పూలమాలలు వేసి జయంతిని నిర్వహించారు. నాయకులు జగన్‌గౌడ్, ప్రేందాస్, రాఘవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌ముదిరాజ్, రమణారెడ్డి, గోపాల్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో...

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సీపీఐ కాప్రా మండల కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నేతలు రాజేశ్వరి, లత, స్వరూప, ఎల్లయ్య, అశోక్‌చారి, మల్లిక, నాగేష్, కృష్ణ, మహేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో కౌమార విద్యపై ఆదివారం నగరంలో ఉపాధ్యాయులకు శిక్షణతోపాటు విద్యార్థులకు పోస్టర్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం జిల్లా అధికారి రమేష్ సంజీవ, విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు మాట్లాడుతూ... జిల్లాలో 73 ప్రభుత్వ ఉన్నత, 8ప్రైవేటు పాఠశాలలో కౌమార విద్యా కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో బాల బాలికలకు కలిగే శారీరక మానసిక, ఉద్వేగ పరమైన మార్పులపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.అనంతరం పోస్టర్ మేళాలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. మండల విద్యాధికారులు హరిశ్చందర్, కిషన్, భాగ్యమని, ఫ్యాకల్టీ ఇ.డి.మధుసూదన్‌రెడ్డి, కూకట్పల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పురపాలక సంఘాల అభివృద్ధే లక్ష్యం

పురపాలక సంఘాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయా పాలక వర్గాల నేతలు స్పష్టం చేశారు. శనివారం మేడ్చల్–మల్కాజిగిరి నియోజకర్గం పరిధిలోని దమ్మాయిగూడ, నాగారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఆయా సమావేశాల్లో పాల్గొన్న చైర్మన్లు మాట్లాడుతూ... పురపాలక సంఘాల పరిధిలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి నిధుల వ్యయానికి తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. – కీసర

దమ్మాయిగూడను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


దమ్మాయిగూడ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్

దమ్మాయిగూడ పురపాలక సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపత్రి ప్రణీతాగౌడ్ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుల సహకారంతో వివిధ వార్డుల్లో అవసరమైన చోట అభివృద్ధి పనులను చేపడతామన్నారు. రూ. 35 లక్షల మున్సిపల్ నిధులతో ప్రగతి నగర్ నుంచి ఐకాం కంపెనీ వరకు బీటీ రోడ్డు, మరో రూ. 4 లక్షల నిధులతో పోచమ్మ గుడికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు, ట్రాక్టర్లు, ఆటోల మరమ్మతు పనులకు రూ. 5 లక్షలు, పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు తదితర వస్తువుల కొనుగోలు కోసం రూ. 4. 5 లక్షలను ఖర్చు చేస్తామన్నారు. మొత్తం రూ. 50 లక్షలతో వివిధ అభివృద్ధి పనుల చేపట్టేందుకు సమావేశంలో తీర్మానించామని వెల్లడించారు. సమావేశంలో కమిషనర్ నాగమణి, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నాగారం సర్వతోముఖాభివృద్ధికి కృషి

నాగారం పురపాలక సంఘంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. వివిధ వార్డుల్లో రూ. 6.5 కోట్ల నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను చేపట్టేందుకు తీర్మానించామన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులందరూ మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజినీర్ సుదర్శనం రఘు, అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

గ్రామ పంచాయతీలకు నిధులు

సాక్షి, సిటీబ్యూరో: నిధుల లేమితో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లింపులు లేక, పనులు సాగక పల్లెల్లో పాలన పడకేసింది. ఏడు నెలలుగా పంచాయతీ పాలకవర్గాలు లేదు. దీంతో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా మారుతున్న నేపథ్యంలో గుడ్డిలో మెల్ల అనే చందంగా ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేసింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కాలువల్లో ఉన్న మురుగును ఎత్తిపారేస్తూ.. రోడ్లన్నీ శుభ్రం చేస్తూ.. ఇంటింటా చెత్తను సేకరిస్తూ, మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతూ పచ్చదనం కోసం పరితపిస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులు దూరం చేయడానికి నిధులు విడుదల చేసింది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 579 గ్రామ పంచాయతీలకు రూ. 9 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో మేడ్చల్ జిల్లాలోని 34 గ్రామ పంచాయతీలకు రూ. 1.51,70.609, రంగారెడ్డి జిల్లాలోని 545 గ్రామ పంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు రూ. 7,48,71,850 మంజూరయ్యాయి.

అవుషాపూర్‌లో చైర్ పర్సన్ పర్యటన


అవుషాపూర్‌లో పర్యటిస్తున్న
చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: అవుషాపూర్ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు బిగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే డ్రైనేజీ సమస్యను జెట్టింగ్ మిషన్‌తో శుభ్రం చేయించారు. ప్రజల కోరిక మేరకు వార్డులో హైమాస్ట్ లైట్లు బిగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లేశ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధవరెడ్డి, సల్మాన్, శంకర్, వేణు, స్థానికులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వే స్టేషన్ మధ్య శుక్రవారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... కర్ణాటక బీదర్‌కు చెందిన జగనాథ్(49) మేడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఐదుగురు సంతానం కాగా పెద్ద కూతురు వివాహం చేశాడు. ఆదాయానికి మించి అప్పులు చేయడంతో చేసిన అప్పులు వారికి చెల్లించలేక మనస్థాపం చెందాడు. జొన్నలు అమ్మగా వచ్చిన డబ్బు అప్పులకు సరిపోలేదని ఇంటిలో చెప్పి మనోవేదనకు గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వే స్టేషన్ మధ్య రైలుకు ఎదురుగా వెళ్లాడు. దీంతో రైలు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పంచానమా అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రాష్ట్ర స్థాయి రెవెన్యూ సదస్సు

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న
అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: శామీర్‌పేట్‌లోని నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రెవెన్యూ సదస్సు ఏర్పాట్లు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరిశీలించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని జిల్లాల రెవెన్యూ సిబ్బందితో పాటు తహసీల్దార్ స్థాయి వరకు పాల్గొననుండటంతో ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్‌ఐలకు సూచించిన విధంగా వారికి కేటాయించిన జిల్లా సిబ్బందిని దగ్గరుండి చూసుకోవాలని, హాజరు, సీటింగ్‌లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సైదులు, తహసీల్దార్ యాదగిరి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డు సృష్టించిన కరాటే బ్లాక్ బెల్ట్ ఉత్తీర్ణులు

పోచారం: జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ హంబో డోజో హైదరాబాద్ వేదికగా ఖానాపూర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో అన్నోజిగూడకు చెందిన గురులోత్ నర్సింహ నాయక్ రికార్డు సృష్టించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్పోర్ట్స్ కరాటే అకాడమీ చీఫ్ గురులోత్ గోవింద్ నాయక్ తనయుడు నర్సింహ నాయక్ 12 ఏళ్ల చిన్న ప్రాయంలోనే బ్లాక్ బెల్ట్ సాధించి సత్తా చాటుకున్నారు. మేడ్చల్ జిల్లాలో చిన్న వయస్కుల్లో బ్లాక్ బెల్ట్ సాధించిన వ్యక్తుల్లో నర్సింహ నాయక్ తొలి వ్యక్తిగా నిలిచారు. పరీక్షలను ముంబైకి చెందిన ఇండియన్ చీఫ్ షహీన్ ఆనంద రత్న నిర్వహించారు. మేడ్చల్ జిల్లా నుంచి పి.శ్రీనివాసమ్, సాయి కిరణ్ కూడా బ్లాక్ బెల్ట్ ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులను తెలంగాణ ప్రతినిధులు రాపోలు సుదర్శన్, దయానంద్ కుమార్, జిల్లా ప్రతినిధి గుగులోత్ గోవింద్ నాయక్ అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పిల్లలు యుద్ధ విద్యలను క్రమశిక్షణతో పాటు కఠోర కృషితో నేర్చుకోవాలని సూచించారు.


వృద్ధురాలిని కట్టేసి నగదు దోచుకెళ్లిన దంపతుల రిమాండ్

- కూతురు బర్త్‌డే పేరుతో పథకం
- ఇంటిని అద్దెకు ఇప్పించిన వృద్ధురాలిపై దాడి
- ఆపై నగలతో పరార్..
  అరెస్టు చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

శామీర్‌పేట్: జగ్గంగూడలో ఓ వృద్ధురాలిని కట్టేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచెకెళ్లిన కేసులో నిందితులను శామీర్‌పేట్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామానికి వచ్చిన నిందితులు నర్సింహ్మ(45), అతని భార్య లక్ష్మి(35) దంపతులు గ్రామంలోని వృద్ధురాలు రాములమ్మ వద్దకు వచ్చి ఇళ్లు అద్దెకు కావాలని అడిగారు. దీంతో ఆమె మీరు ఏం పనిచేస్తారని ప్రశ్నించింది. తాము ఫినాయిల్, యాసిడ్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తామని పిల్లలతో కలిసి జీవిస్తామని తెలుపడంతో వృద్ధురాలు తన ఇంటికి సమీపంలో ఉన్న ఓ ఇంటిని అద్దెకు ఇప్పించింది. ఈ క్రమంలో వృద్ధురాలిలో సన్నిహితంగా మెలిగిన దంపతులు ఈ నెల 23న తన కూతురు పుట్టిన రోజు ఉందని ఇంటికి రావాలని కోరడంతో వృద్ధురాలు వారి ఇంటికి వెళ్లింది. వృద్ధురాలికి మద్యం తాగించిన దంపతులు పథకం ప్రకారం ఆమె ముఖాన్ని గుడ్డతో మూసివేసి నోట్లో గుడ్డలు కుక్కి మెడకు తాడుకట్టి చంపేందుకు యత్నించగా వృద్ధురాలు స్పృహతప్పి పడిపోయింది. దీంతో ఆమె ఒంటిపై ఉన్న బంగారం, వెండి ఆభరణాలు దోచుకుని పిల్లలతో కలిసి దంపతులు బైక్‌పై పరారయ్యారు. కొంతసేపటికి తేరుకున్న మహిళ కేకలు చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీసీపీ ఆదేశాల మేరకు పలు బృందాలుగా ఏర్పడి నాలుగు రోజుల్లో నిందితులను పట్టుకుని కేసును చేధించారు. వారి నుంచి సుమారు 7 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, 3 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా నిందితులు నర్సింహా, జ్యోతి దంపతులు దేశ దిమ్మరులుగా ఊరూరా తిరుగుతూ పథకం ప్రకారం దొంగతనాలకు పాల్పడుతూ జీవనం సాగిస్తున్నారని గతంలో వీరిపై నాలుగు కేసులు ఉన్నాయని డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. కేసు ఛేదించిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్, గంగాధర్, నర్సింహా, ఎస్‌ఐలు పరుశురాం, దశరథ పాల్గొన్నారు.

స్కూల్‌ను పరిశీలించిన చైర్మన్



పోచారం: ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్ పాఠశాలను చైర్మన్ కొండల్‌రెడ్డి శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. స్కూల్‌లో తాగునీటి సమస్య ఉందని విద్యార్థులు చెప్పడంతో వారం రోజుల్లో పరిష్కరిస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. అనంతరం వంట గదిని, టాయ్‌లెట్లను పరిశీలించారు. జలమండలి ఏఈ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ చోరీ: డ్రైవర్‌పై కేసు

ఘట్‌కేసర్: ట్యాంకర్ నుంచి పెట్రోల్‌ను చోరీ చేసిన డ్రైవర్‌పై కేసు ఘట్‌కేసర్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... కల్వకుర్తికు చెందిన రాములు(30) పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్. శుక్రవారం అవుషాపూర్ బీపీసీఎల్ పెట్రోల్ బంకు వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో ఒక ట్యాంకర్ నుంచి పెట్రోల్ తీస్తుండగా విధుల్లో ఉన్న పోలీస్ పెట్రోలింగ్ వ్యాన్ సిబ్బంది అతడిని పట్టుకున్నారు. స్థానికంగా పరిశీలించగా ట్యాంకర్ పైకప్పులో పైపు వేసి 20 లీటర్ల కేపాసిటన్నున్న రెండు క్యాన్లలో పెట్రోల్ దొంగిలించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు


మహాజనసభలో పాల్గొన్న సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కీసర: కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రైతులకు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తామని సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన మహా జనసభలో ఆయన మాట్లాడుతూ... రైతు సహకార సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, సొసైటీ కార్యదర్శి కృష్ణారెడ్డి, డైరెక్టర్లు మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, కామసాని మల్లారెడ్డి, మాలోత్ ధర్మా, అంజిరెడ్డి, పోచిరెడ్డి, మచ్చాని మల్లేష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'సెయింట్ పీటర్స్'లో సందడిగా ఫ్రెషర్స్ డే


ఫ్రెషర్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాలలో మొదటి సంవత్సరంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ర్యాంప్ వాక్, సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థులంతా సోదరభావంతో మెలగాలని కళాశాల సెక్రటరీ టి.వి.రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఘట్‌కేసర్ బాలాజీనగర్ ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన అబ్దుల్ అజీజ్(35) తన ఇంటి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో పెద్ద డొమెస్టిక్ సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లలోకి రీ ఫిల్లింగ్ చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా పెద్ద సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లలోకి రీ ఫిల్లింగ్ చేస్తుండగా గమనించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చిన్న సిల్లిండర్లలో నింపి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. పంచనామా అనంతరం అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం


పురస్కారాలను అందుకున్న ఆర్టీసీ మేడ్చల్ డిపో కార్మికులు


మేడ్చల్: మేడ్చల్ డిపోలో పని చేస్తున్న టీజీ ఆర్టీసీ కార్మికులకు ఆగస్టు నెలకు సంబంధించి ప్రగతి చక్రం పురస్కారాలను శనివారం డిపో అధికారులు ప్రదానం చేశారు. ఆగస్టులో ఇంధనం పొదుపు చేసి బస్సులు నడిపిన డ్రైవర్లకు, బ్రేక్ డౌన్ లేకుండా బస్సులను నిర్వహించిన మెకానిక్‌లను ఎంపిక చేసి వారికి అవార్డులు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. సమావేశంలో కూకట్‌పల్లి రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం కవిత రూపుల, డీఎం సుధాకర్, అసిస్టెంట్ డీఎం రామారావు, ఇంజినీర్ స్నేహలత, సూపరింటెండెంట్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

రెవెన్యూ ఉద్యోగులను బెదిరించాడని ఆరోపణలు

ఘట్‌కేసర్: ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించి అధికారులను బెదిరించిన వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... ఎదులాబాద్ రెవెన్యూ ఘనాపూర్ పంచాయతీ పరిధిలోని రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసిన 1077, 1078, 1082, 1083, 1084, 1086, 1087, 1088లోని 33 ఎకరాల భూదాన్ భూమిని 14 మంది రైతుల నుంచి జగత్ స్వప్న రియల్ ఎస్టేట్ కంపెనీ కొనుగోలు చేసి అక్రమంగా ప్లాట్లు విక్రయిస్తుందని ఆరోపిస్తు ఈ నెల 18న నంగారి భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ గణేశ్‌నాయక్ తహసీల్దార్ రజినికి ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ ఈ నెల 19న నాయబ్ తహసీల్దార్, సర్వేయర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గణేశ్‌నాయక్ తిరిగి 21న తహసీల్దార్ కార్యలయానికి వచ్చి సర్వే రిపోర్ట్ కావాలని కోరగా రిపోర్టు తయారు చేస్తున్నామని, ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలపడంతో నాయబ్ తహసీల్దార్, సర్వేయర్ తెలపగా వారితో వాగ్వాదం చేశాడు. అనంతరం 24న మళ్లీ వచ్చి తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, సర్వేయర్, ఇతర రెవెన్యూ సిబ్బందిని దుర్భాషలాడుతూ వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించాడని తహసీల్దార్ రజిని ఘట్‌కేసర్ పీఎస్‌లతో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గణేశ్‌నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

నకిలీ నెంబర్‌తో లారీని నడిపిస్తున్న యజమానిపై కేసు



డూప్లికెట్ నంబర్ బిగించి
ఇసుకను తరలిస్తున్న లారీ

ఘట్‌కేసర్: అసలు నెంబర్ దాచి డూప్లికెట్ నెంబర్‌తో లారీని నడిపిస్తున్న యజమానిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... యంనంపేట్ చౌరస్తాలో స్టేట్ విజిలెన్స్ టీం శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుకను తరలిస్తున్న టీఎస్07 యూఎన్–0963 నెంబర్ గల లారీ పత్రాలను పరిశీలించారు. దీంతో ఓ ఆ వాహనం అసలు నెంబర్ టీజీ30–టీ2345గా తేలింది. వెంటనే లారీ డ్రైవర్ గౌతమ్(24)ను అదుపులోకి తీసుకున్నారు. డూప్లికెట్ నెంబర్‌ను బిగించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న డ్రైవర్ గౌతమ్(24), లారీ యజమాని సుర్వి నరేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.